

అధిక లోడు..
అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో ఇబ్బంది పడుతున్నామని బొంరాస్‌పేట వానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
8లో▸




కొడంగల్‌కు రూ.437 కోట్లు
కొడంగల్ అభివృద్ధి పనులకు రూ.437 కోట్లు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు.
8లో▸



ఆడబిడ్డలకు ప్రభుత్వం అండ
రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు.
9లో▸

ఇక గ్రామ సభలు

- నేటి నుంచి 24 వరకు సభలు
- లబ్ధిదారుల జాబితాతో గ్రామాలకు అధికారులు
- 14 వేల మందికి ఇందిరమ్మ ఇళ్లు
- 22వేల మందికి ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు
- 5.90లక్షల ఎకరాలకు రైతు భరోసా



గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు కొత్త పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ప్రజా ఆమోదంతోనే లబ్ధిదారుల ఎంపిక నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో నేటి నుంచి నాలుగురోజుల పాటు గ్రామ సభలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల్లోనే అధికారులు ఎంపిక చేసిన జాబితా ప్రదర్శించనున్నారు.

వికారాబాద్: ప్రభుత్వం ఈ నెల 26 నుంచి మరో నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించనున్న నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు నిర్వహించనున్న గ్రామ సభలకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సభల్లోనే గ్రామస్తుల సమక్షంలో లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తెలపాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఇదే విషయమై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపికకు గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి దరఖాస్తుల విచారణ పూర్తి చేశారు.

ఆత్మీయ భరోసాకు 20 రోజుల నిబంధన

వ్యవసాయ భూమి లేని రైతు కూలీ కుటుంబానికి ఏడాదికి రూ.12 వేల చొప్పున ఆర్థికసాయం అందజేయాలని నిర్ణయించిన నేపథ్యంలో అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఈ పథకానికి జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 వేల మందిని ఎంపిక చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ పథకంలో లబ్ధిదారుల ఎంపికకు గతేడాది కనీసం 20 రోజులు ఉపాధి హామీ పథకం పనులకు హాజరవ్వాలనే నిబంధన పెట్టడంతో పలువురికి ఇది అడ్డంకిగా మారుతోంది. జిల్లాలో వేల సంఖ్యలో కూలీలు ఉపాధి పనులకోసం దరఖాస్తులు చేసుకుని ఉండగా వారికి జాబ్‌కార్డులు రాలేదు. జిల్లాలో 1,83,309 జాబ్‌కార్డులుండగా ఇందులో 3,77,087 మంది కూలీలు ఉన్నారు. వేసవిలో సగటున 51 వేల నుంచి లక్ష పై చిలుకు కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

14 వేల ఇళ్లకు 2.57లక్షల దరఖాస్తులు

సొంతిళ్లు లేని నిరుపేదలకు నియోజకవర్గానికి 3 వేల నుంచి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో కలిసి 14వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నారు. గ్రామాల్లో సంక్షేమ పథకాల దరఖాస్తుల కంటే ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 2.57లక్షల దరఖాస్తులు అందగా స్థలం ఉండి దారిద్ర్యరేఖకు దిగువగా ఉన్న పేదలకు మొదటి విడతలో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కాగా లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ ముఖ్య నేతల కనుసన్నల్లోనే జరుగుతోందని సమాచారం.

రూ.354 కోట్ల రైతు భరోసా

జిల్లాలో మొత్తం 6.17 లక్షల భూమి ఉండగా 2,68,107 మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఈ మొత్తం భూమికి రైతు బంధు డబ్బులు ఎకరాకు రూ.పది వేల చొప్పున రెండు విడతల్లో రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఒక్కో పంటకు జిల్లాలో రూ.308 కోట్ల నుంచి రూ.320 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో వేశారు. ప్రస్తుత ప్రభుత్వం సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా పేరుతో ఏడాదికి ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో 5.90లక్షల ఎకరాలకు రూ.354 కోట్లు చెల్లించనున్నారు.

కొత్త రేషన్ కార్డులకు జాబితా సిద్ధం

జిల్లాలో ఉన్న 20 మండలాల్లో 588 చౌకధరల దుకాణాలు ఉండగా ఇప్పటి వరకు 2,41,622 ఆహార భద్రతా కార్డులు జారీ చేశారు. ఇందులో 2,08,162 ఎఫ్‌ఎస్‌సీ కార్డులు, 26,730 అంత్యోదయ కార్డులు, 39 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. వీటి ద్వారా ప్రతి నెల 4673 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. కొత్త రేషన్‌కార్డులకు 22 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే ఉన్న కార్డులలో 59వేలు పేర్లు చేర్చాలని 33 వేల దరఖాస్తులు వచ్చాయి. ప్రస్తుతం 59 వేల పేర్లు ఇప్పటికే ఉన్న కార్డులలో చేర్చడంతో పాటు 22 వేల దరఖాస్తుదారులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు అధికారులు జాబితా సిద్ధం చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అంకితభావంతో పనిచేయాలి

- షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు నిర్వహించాలి
- నాలుగు పథకాల ఫిర్యాదుల స్వీకరణకు నాలుగు రిజిస్టర్లు
- ప్రజలకు సామరస్యంగా సమాధానం ఇవ్వాలి
- లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సంక్షేమ పథకాల అమలుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్‌తో కలిసి గ్రామసభలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి నాలుగు సంక్షేమ పథకాలపై చర్చించారు. గ్రామ సభలను షెడ్యూల్ ప్రకారం సమయపాలన పాటిస్తూ నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యానికి తావులేకుండా జాగ్రత్తగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. లబ్ధిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ అన్నారు. గ్రామ సభల్లో ఫ్లెక్సీలు, టెంట్లు, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకుని మెడికల్ టీం అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో అర్హుల జాబితా ప్రదర్శించాలని.. గ్రామ సభలో అందే ఫిర్యాదులపై నాలుగు పథకాలకుగాను నాలుగు రిజిస్టర్లు ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరించాలన్నారు. గ్రామ సభలు ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30గంటల నుంచి మధ్యాహ్నం 3.30గంటల వరకు నిర్వహించాలన్నారు. సమస్యాత్మక ప్రశ్నలకు సామరస్యంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

అభ్యంతరాలుంటే దరఖాస్తులు

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలలో లబ్ధిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని, అభ్యంతరాలుంటే దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రజలకు ఎలాంటి అపోహలకు తావు ఉండకుండా స్పష్టంగా వివరించాలన్నారు. ఈ మొత్తం సంక్షేమ పథకాల రోజు వారీ ప్రక్రియను మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామ సభల తీర్మాన ప్రతులను సురక్షితంగా, జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, డీఎస్‌ఓ మోహన్ బాబు , పీడీ హౌసింగ్ కృష్ణ, వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి, జిల్లా ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండలాల ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మిల్లర్లకు నిర్దేశించిన సీఎంఆర్ అందజేయాలి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: రైస్ మిల్లర్లు నాణ్యమైన సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) అందజేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల కార్యాలయంలో ధాన్యం డెలివరీపై మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యం మేరకు బియ్యం అందజేయాలన్నారు. జనవరి 25 వరకు 2,221 టన్నుల సన్నబియ్యంతో పాటు 2023–24 వానాకాలానికి సంబంధించిన 5,499.279 మెట్రిక్ టన్నుల బియ్యం సైతం అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి మోహన్‌బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఏసీఎస్‌ఓ ఆర్తి నాయక్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాలేశ్వర్ గుప్తా, కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

జిల్లా వైద్యాధికారి వెంకటరవణ



వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌ఓ వెంకటరవణ

దోమ: ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరవణ సూచించారు. సోమవారం మండల పరిధిలోని బొంపల్లి ఉప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్) ఆధ్వర్యంలో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలను ఏఓ ప్రవీణ్, నాణ్యత ప్రమాణాల మేనేజర్ అనురాధ, డీటీహెచ్‌ఓ చండీశ్వరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి పరిసరాలు, మందులు తనిఖీ చేశారు. రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే వైద్యులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



ప్రభుత్వాసుపత్రి వద్ద మాట్లాడుతున్న ఆనంద్

అనంతగిరి: ప్రభుత్వం పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వికారాబాద్ ప్రభుత్వాస్పత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత న్యూట్రీషియన్ కిట్ బంద్ అయిందన్నారు. నాలుగు నెలలుగా బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్ పనిచేయడం లేదన్నారు. పరీక్షల నిమిత్తం బ్లడ్ శాంపిల్స్ తీసుకుని 12 రోజులైనా రిపోర్టులు అందడం లేదని రోగులు వాపోతున్నారన్నారు. అమ్మ ఒడి పథకం అమలు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆస్పత్రుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, రామస్వామి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడండి

మొయినాబాద్: కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని తోలుకట్ట గ్రామస్తులు రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. తోలుకట్ట రెవెన్యూలోని 108, 107, 85, 139, 138, 137, 143 సర్వేనంబర్లలో ఉన్న సుమారు 126 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తెలిపారు. ఇటీవల 108, 143 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని అక్రమార్కులు కబ్జా చేశారని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశామని.. ఫిర్యాదు చేసిన గ్రామస్తులపై కబ్జాదారులు కేసులు పెట్టారని చెప్పారు. తమకు నోటీసులు ఇచ్చి ఇళ్లవద్దకు బౌన్సర్లను పంపి బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌ను కోరారు.



చివరి మున్సిపల్ సాధారణ సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు

మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

చివరి సాధారణ సమావేశంలో 11 అంశాలకు ఏకగ్రీవ ఆమోదం

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కొత్తగా రూ.60 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షత చివరి మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 11 అంశాలతో కూడిన ఎజెండాను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోందన్నారు. కొత్తగా మంజూరైన నిధులకు సంబంధించి త్వరలోనే స్పీకర్ ప్రసాద్‌కుమార్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పట్టణాభివృద్ధికి రూ.పదికోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరుకానున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ శంషద్‌బేగం, ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు మారాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

తాండూరు రూరల్: పదోతరగతి సిలబస్ పూర్తి చేసి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని.. ఉత్తీర్ణత శాతం మెరుగుపడాలని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం పెద్దేముల్ జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) పాటశాలలో మండల విద్యాధికారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పనితీరు మార్చుకుని విధులపట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. మధ్యాహ్నభోజన విషయంలో అజాగ్రత్త వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. టీఎల్ఎమ్‌లు వినియోగిస్తూ విద్యార్థులకు బోధించాలన్నారు. సమావేశంలో మండల విద్యాధికారి నర్సింగ్‌రావు ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



తాండూరు రూరల్: మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించాలి

ధారూరు: ఇంగ్లిష్ రీడింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్(బాలుర) పాఠశాలలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. 3,4,5 తరగతుల విద్యార్థులకు రీడింగ్ యాక్టివిటీ ద్వారా ప్రత్యేక కార్యాచరణతో ప్రతి రోజు పదినిమిషాల సమయం కేటాయించి ప్రగతిని నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఈఓ శ్రీనివాస్, ఏఎంఓ రామ్‌గుప్తా, కాంప్లెక్స్ కార్యదర్శి ఇందిర, రిసోర్స్‌పర్సన్లు బాల్‌రాజ్, నర్సింహరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల పాత్ర కీలకం

- మంత్రి జూపల్లి కృష్ణారావు

షాద్‌నగర్: సమాజంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకరోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రంథాలయాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రంథాలయాల్లో డిజిటలైజేషన్ చేయడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. సమాజంలో ఏమార్పు జరగాలన్నా గ్రంథాలయాలతో సాధ్యం అవుతుందని అన్నారు. తెలంగాణ చరిత్రను మార్చిన ఘనత గ్రంథాలయానికి ఉందన్నారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మదన్‌మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా నక్కబాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా క్యాసెట్ శ్రీను తదితరులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, తిరుపతి రెడ్డి, విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, కొంకళ్ల చెన్నయ్య, దంగు శ్రీను పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పోలీసులకు ఇంటర్‌జోన్ క్రీడా పోటీలు

ప్రారంభించిన ఎస్పీ నారాయణరెడ్డి



షాట్‌పుట్ విసురుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: ఒత్తిళ్లను అధిగమిస్తూ క్రీడల్లో రాణించి స్ఫూర్తిగా నిలవాలని పోలీస్ క్రీడాకారులకు ఎస్పీ నారాయణరెడ్డి సూచించారు. సోమవారం వికారాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నిర్వహిస్తున్న ఇంటర్ జోన్ పోలీస్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఇంటర్‌జోన్‌లో గెలిచిన పోలీస్ క్రీడాకారులు కరీంనగర్‌లో జనవరి 28 నుంచి ఫిబ్రవరి ఒకటి వరకు నిర్వహించే 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్– పోలీస్ మీట్స్‌లో పాల్గొంటారని చెప్పారు. ఈ మీట్‌లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టగ్‌ఆఫ్‌వార్, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, ఫుట్ బాల్, బాస్కెట్ బాల్ పోటీలుంటాయని చెప్పారు. క్రీడా పోటీలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్ డీఎస్పీ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పరిగిని ఆదర్శ మున్సిపాలిటీ తీర్చిదిద్దుతానని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు గ్రామాలకు, పట్టణాలకు అందాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ క్రిందకు తీసుకురావడంతో మరింత అభివృద్ధి జరగనుందన్నారు. పట్టణంలో ఇప్పటికే రూ.16 కోట్ల నిధులతో అన్ని వార్డుల్లో నీటి సమస్యల పరిష్కారం కోసం ట్యాంకుల నిర్మాణం జరుగుతోందన్నారు. పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధికి పాటుపడుదామన్నారు. లక్నాపూర్ ప్రాజెక్టులో బోటింగ్ ఏర్పాటు చేసి పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దుతానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, వైస్ చైర్మన్ ప్రసన్న, కౌన్సిలర్లు రవీందర్, వెంకటయ్య, కృష్ణ, మునీర్, నాగేశ్వర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరిస్తాం

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో టీయూటీఎఫ్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వానరానికి అంత్యక్రియలు



కోతి కళేబరాన్ని తీసుకెళ్తున్న ప్రవీణ్

కొడంగల్: పట్టణంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వానరం చనిపోయింది. కుక్కలు లాక్కెళ్తుండగా విషయం తెలుసుకున్న అమ్మ నాన్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రవీణ్ అక్కడికి వెళ్లి కోతి కళేబరాన్ని పరిశీలించారు. అనంతరం సంప్రదాయ బద్ధంగా వానరానికి అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

గవర్నర్‌ను కలిసిన నాయకులు



గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న బీజేపీ నాయకులు

పరిగి: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను రాజ్‌భవన్‌లో సోమవారం బీజేపీ పట్టణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. హైదారాబాద్ నగరానికి కూత వేటు దూరంలో ఉన్న పరిగి ఇంకా అభివృద్ధికి నోచుకోలేదని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ సీనియర్ నాయకులు ఆంజనేయులు, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జీపీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

కేశంపేట: గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డితో కలిసి జీపీ వర్కర్స్ కేలండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు జీఓ 60ని అమలు చేయాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దుచేయాలన్నారు. 2011 జనాభా ప్రతిపాదికన పంచాయతీల్లో కార్మికులను నియమించారని, ఆ విధాన్నాన్ని రద్దు చేసి అవసరాలకు అనుగుణంగా కార్మికులను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ కిష్టయ్య, జూనియర్ అసిస్టెంట్ ప్రకాష్, కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి పారేష, స్వరూప, మల్లయ్య, అంజయ్య, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి



మాట్లాడుతున్న రామస్వామి

చేవెళ్ల: ప్రజలకు వంద వసంతాల సందర్భంగా సీపీఐ పార్టీ గొప్పతనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పార్టీ వంద వసంతాల సందర్భంగా నియోజకవర్గస్థాయి జనరల్‌బాడీ సమావేశం ఈ నెల 28వ తేదీన చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశాన్ని నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కుణంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే పార్టీ సీపీఐ అన్నారు. పెద్ద ఎత్తున ప్రజాసంఘాలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఈ సమావేశానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్తిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అధిక లోడు.. ప్రమాదం చూడు



రేగడిమైలారం–కొడంగల్ మార్గంలో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న కంకర లారీ



వాహనాలకు చలాన్లు వేస్తున్న అధికారులు (ఫైల్)

- పరిమితికి మించిన లోడ్‌తో లారీల రాకపోకలు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

బొంరాస్‌పేట: అధిక లోడుతో వెళ్తున్న వాహనాలతో నిత్యం అవస్థలు పడుతున్నామని మండల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించి ఇసుక, కంకర, కలప తదితర సామగ్రిని వేసుకొని నిత్యం వందలాది లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో త్వరగా రోడ్డు మరమ్మతులు గురవుతోంది. గుంతలు పడి ప్రయాణానికి ఆటంకం కలిగిస్తోంది. అదుపు చేయాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

లోపించిన పర్యవేక్షణ

మండల పరిధిలోని జాతీయ రహదారిపై గూడ్స్ వాహనాల రద్దీ రోజురోజుకు పెరుగుతోంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఓవర్ స్పీడ్‌తో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. మండలంలోని మెట్లుకుంట శివారు తండాల నుంచి తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం మీదుగా కొడంగల్ వరకు 15 కిలో మీటర్ల దూరం జాతీయ రహదారి 163 ఉంది. దీనిపై మెట్లకుంట చెక్‌పోస్టు వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. కాగా చౌదర్‌పల్లి శివారులో రెండు కంకర మిషన్‌లు, దుద్యాల మండల పరిధిలోని ఈర్లపల్లి, గౌరారం శివారులో మరో కంకర మిషన్ ఉంది. ఇక్కడి నుంచి అధిక లోడుతో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. వెనకాల వచ్చే వాహనాలపై దుమ్ము ధూళి పడేసుకుంటూ అవరోధం సృష్టిస్తున్నాయి.

తరచూ ప్రమాదాలు

మహంతీపూర్, మద్దిమడుగుతండా, కొత్తూరు శివారుల్లో నుంచి బొంరాస్‌పేట కాగ్నా వాగు పారుతుండటంతో స్థానికంగా జోరుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. ఇటీవల ఇసుక రవాణాకు అనుమతి లేకుండా పోలీసుల ముందు నుంచే పట్టపగలే ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. మండలంలో చెట్లను నరికివేస్తూ జోరుగా అక్రమ కలప రవాణా విచ్చలవిడిగా సాగుతోంది. దీనిపై సదరు అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. అప్పుడప్పుడు అధికారులు చలాన్లు వేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. వాహనాల రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న నాయకులు

కుల్కచర్ల: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు చేకూరుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులంతా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, అంజిలయ్య, వెంకటయ్య, విఠల్ నాయక్, రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాయపల్లిలో..

దోమ: సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ నేతలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని కొండాయపల్లి గ్రామానికి చెందిన బుడ్డ రామయ్య కొంత కాలంగా అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీఎం సహాయనిధి కింద వైద్య ఖర్చుల నిమిత్తం రూ.44 వేలను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంజూరు చేయించారు. ఈ మేరకు నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్.ఆంజనేయులు, వెంకటయ్య పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి



శివశంకర్ (ఫైల్)

మోమిన్‌పేట: ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో చోటుచేసుకుంది. కుటుంబీకులు, ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గజ్జెల శివశంకర్‌గౌడ్(28) ఆదివారం సాయంత్రం తన పొలానికి వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో సోమవారం ఉదయం తండ్రి సుదర్శన్ పొలానికి వెళ్లి చూశాడు. అక్కడ ఉన్న బావి వద్ద చెప్పులు ఉండటంతో అందులో జారి పడినట్లు ఆనవాళ్లు కన్పించాయి. ఈ మేరకు స్థానికులకు సమాచారమివ్వడంతో మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భక్తులపై వ్యాపారుల దౌర్జన్యం



భక్తులపై దాడి చేస్తున్న వ్యాపారులు

కొత్తూరు: ప్రఖ్యాతి గాంచిన జేపీదర్గా ఆవరణలో వ్యాపారుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. తాజాగా సోమవారం దర్గా దర్శనం కోసం నగరం నుంచి వచ్చిన ఇద్దరు భక్తులపై కొందరు వ్యాపారులు తమ వద్ద పూలు కొనుగోలు చేయాలని దాడికి పాల్పడ్డారు. ఘటనకు సంబంధించిన వివరాలు సీసీ పుటేజీల్లో నిక్షిప్తం అయ్యాయి. ఇరువురు భక్తులపై దర్గా ఆవరణలో పూల వ్యాపారం చేసే నలుగురు వ్యక్తులు తమ వద్ద పూలు కొనుగోలు చేయాలని దౌర్జన్యానికి పాల్పడ్డారని, కర్రలతో కొట్టినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ కాలేజీకి తాళం వేసిన విద్యార్థులు



డిగ్రీ కళాశాల గేటుకు తాళం వేస్తున్న విద్యార్థి



కళాశాల ఎదుట విద్యార్థుల నిరసన

- 45 రోజులుగా పాఠాలు చెప్పని వైనం
- స్పందించని యాజమాన్యం

తాండూరు టౌన్: తరగతులు కొనసాగక పోవడంతో ఆగ్రహించిన విద్యార్థులు ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలకు తాళం వేశారు. ఈ ఘటన తాండూరులో చోటుచేసుకుంది. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న శ్రీసాయి డిగ్రీ కళాశాలలో 400 మంది విద్యార్థులతో కొనసాగుతోంది. గతేడాది నవంబర్ చివరిలో సెమిస్టర్ పరీక్షలు ముగిసిన నాటి నుంచి, సుమారు 45 రోజులుగా కళాశాలలో అధ్యాపకులు పాఠాలు చెప్పడం విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై కళాశాల కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని విద్యార్థులు వాపోతున్నారు. పాఠాలు కొనసాగక పోవడంతో తమ విలువైన సమయం వృధాగా పోతోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విద్యార్థులు, బీసీ జేఏసీ విద్యార్థి సంఘం నాయకులను ఆశ్రయించడంతో కళాశాల ఎదుట నిరసనకు దిగారు. కళాశాల కరస్పాండెంట్ వచ్చి తరగతులను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ.. కళాశాలకు తాళం వేసామని బీసీ జేఏసీ విద్యార్థి సంఘం నాయకులు సాయి, మనోహర్ తెలిపారు. యూనివర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కొన్ని నెలల నుంచి యాజమాన్యం చెల్లించకపోవడంతోనే పాఠాలు చెప్పడం లేదని పలువురు అధ్యాపకులు తెలిపారు. ఈ విషయమై కళాశాల కరస్పాండెంట్ మల్లేశ్ యాదవ్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

బీసీలు అన్ని రంగాల్లో ఎదగాలి

బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ



చంద్రశేఖర్, మాణెయ్యలను సన్మానిస్తున్న బీసీ నేతలు

షాబాద్: బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో బీసీ ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన కావలి చంద్రశేఖర్, బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మద్దూరు మాణెయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. హక్కుల సాధనకోసం బీసీలు సమష్టిగా పోరాడాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు నర్సింహులు, కుర్వ సంఘం మండల అధ్యక్షుడు పాండు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు లింగం, మాసయ్య, గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య, బీసీ ఐక్యవేదిక నాయకులు రవీందర్, స్వామి, నర్సింహులు, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, ఆనందం, చెన్నయ్య, గౌరీశ్వర్ పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్ కేటాయించాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ డిమాండ్ చేశారు. మండల పరిధి మన్మర్రి గ్రామంలో సేన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జెట్టని శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఉల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది రాజు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలలో ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. బీసీల లెక్క తేలడానికి దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన అగ్రకులాలకు ఒక రోజులో బిల్లు పెట్టి, ఆగమేఘాల మీద 10 శాతం రిజర్వేషన్లు ఆమోదించారని, వారికి రిజర్వేషన్లు పెంచడానికి మూడు రోజుల్లో లోక్‌సభ, రాజ్యసభలో సవరణ చేసి రాష్ట్రపతి సంతకం చేశారని వెల్లడించారు. కానీ 50 శాతం జనాభా ఉన్న బీద కులాలకు రాజ్యాంగ సవరణ చేయరా అని ప్రశ్నించారు. మూడు దశాబ్దాలుగా పోరాడుతున్నా బీసీల బిల్లును కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం ఆరోపించారు. పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి, చట్టసభల్లో 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

కొడంగల్@ రూ.437 కోట్లు

- మంజూరు చేసిన ప్రభుత్వం
- పురపాలక సంఘం సమావేశంలో వెల్లడించిన చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: అభివృద్ధి పనులకు రూ.437 కోట్లు మంజూరైనట్లు కొడంగల్ మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కొడంగల్ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని చెప్పారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పాలక మండలి చివరి సమావేశం నిర్వహించారు. ఇందులో గతంలో చేపట్టిన పనులు.. భవిష్యత్తులో చేయాల్సిన పనులపై సభ్యులతో చర్చించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా విస్తరణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లు తదితర పనులకు రూ.337 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు. పాత కొడంగల్ ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ.45 కోట్లు, మినీ స్టేడియం నిర్మాణానికి రూ.3 కోట్లు, ఇతర అభివృద్ధి పనులకు రూ.52 కోట్లకు అనుమతి వచ్చిందన్నారు. త్వరలో పనులు చేపట్టాల్సి ఉందన్నారు. మొత్తం రూ.437 కోట్లను కొడంగల్ మున్సిపల్‌కి కేటాయించినందుకు ప్రభుత్వానికి పాలకమండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల సహకారంతోనే..

ఉద్యోగుల సహకారంతోనే మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని అన్ని విభాగాల సిబ్బంది సహకారంతోనే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నట్లు చెప్పారు. శానిటేషన్, తాగునీరు, వీధి బల్బులు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్వహణ ఉద్యోగుల సహకారంతో సాధ్యమైందన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాం నాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా రైతు భరోసా సర్వే

సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



సర్వే తీరును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు రూరల్: గ్రామాల్లో పకడ్బందీగా రైతు భరోసా సర్వే కొనసాగుతుందని తాండూరు డివిజన్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఎల్మకన్నె గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో లే అవుట్లు, మైనింగ్, మట్టి తవ్వకాలు జరిపిన భూముల్లో రైతు భరోసా నిలిపివేస్తామన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడిసాయం ఇస్తామన్నారు. రైతులకు సమస్యలు ఉంటే స్థానికంగా ఉండే ఏఈఓల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులకు సంబంధించి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ఏఈఓ శ్రీనివాస్, నాయకులు జగదీష్ తదితరులు ఉన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

ఆర్డీఓ వాసుచంద్ర



కుల్కచర్ల: ముజాహిద్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

కుల్కచర్ల: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి అధికారులు ప్రజలకు వివరించాలని ఆర్డీఓ వాసుచంద్ర అన్నారు. సోమవారం మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న రేషన్ కార్డు లబ్ధిదారుల గుర్తింపు కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో ప్రస్తుతం వచ్చిన వారి వివరాలను పరిశీలించడంతో పాటుగా రానివారు ఇచ్చే దరఖాస్తులను సైతం స్వీకరించాలని సూచించారు. గ్రామసభలో ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, రేషన్‌కార్డు లబ్ధిదారుల ఎంపిక కోసం చర్చించి అభిప్రాయాలను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయి ఉద్యోగులు నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వరాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, తహసీల్దార్ మురళీధర్, ఆర్ఐ రవి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, స్థానిక నాయకులు చంద్రభూపాల్, భాస్కర్, షర్ఫొద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల విచారణ మండలంలో కొనసాగుతుంది. సోమవారం మండల పరిధిలోని రాజీవ్ కాలనీలో ఆర్ఐ సాయిచరణ్ తన సిబ్బందితో కలిసి రేషన్‌కార్డుల విచారణ చేపట్టారు. కొత్తగా కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కుటుంబ సభ్యుల పేర్ల నమోదు వివరాలపై విచారణ చేపట్టారు.

అంబులెన్స్‌లో రెండు సుఖప్రసవాలు



పసికందును అప్పగిస్తున్న108 సిబ్బంది

కందుకూరు: మూడు గంటల వ్యవధిలో ఒకే 108 అంబులెన్స్ సిబ్బంది ఇద్దరు గర్భిణులకు సుఖప్రసవం చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నేదునూరు గ్రామ సమీపంలోని ఇటుక బట్టీల్లో పని చేస్తున్న ఒడిశాకు చెందిన నలినిబాయికి పురిటి నొప్పులు వచ్చాయి. రెండో కాన్పు నిమిత్తం ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో 108కి సమాచారం అందించారు. ఆమెను ఆస్పత్రికి తరలించే క్రమంలో నొప్పులు ఎక్కువ అయ్యాయి. దీంతో ఈఎంటీ రాయుడు, పైలట్ యాదయ్య సుఖప్రసవం చేయగా మగ బిడ్డకు జన్మనిచ్చింది.

రాత్రి 2గంటలకు..

అదే రాత్రి 2 గంటల సమయంలో మండల పరిధి లేమూరుకు చెందిన సంధ్యకు పురిటినొప్పులు రావడంతో 108కి సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలిస్తుండగా నొప్పులు అధికమవడంతో వాహనంలో ప్రసవం చేశారు. ఆడపిల్లకు జన్మనిచ్చింది. శంషాబాద్‌లోని సీహెచ్‌సీకి తరలించారు.

దుండగుల గమ్యం గజ్వేల్!

సికింద్రాబాద్ నుంచి ఆటో మాట్లాడుకుంది అక్కడికే..

- డ్రైవర్‌పై అనుమానంతో తిరుమలగిరిలో దిగిన ద్వయం
- అక్కడ నుంచి మళ్లీ బోయిన్‌పల్లి వైపు వచ్చినట్లు గుర్తింపు
- కాల్పుల కేసులో కొనసాగుతున్న నగర పోలీసుల దర్యాప్తు

సాక్షి, సిటీబ్యూరో: కర్ణాటకతో పాటు నగరంలో తుపాకీతో కాల్పులకు తెగబడిన దుండగులు అఫ్జల్‌గంజ్ ఫైరింగ్ తర్వాత గజ్వేల్ వెళ్లాలని భావించారు. సికింద్రాబాద్ నుంచి ఆటోను ఆ ప్రాంతానికే మాట్లాడుకున్నారు. అయితే మార్గమధ్యంలో డ్రైవర్ వ్యవహారశైలిపై వారికి అనుమానం రావడంతో తిరుమలగిరిలో దిగిపోయారు. రోషన్ ట్రావెల్స్‌కు చెందిన మేనేజర్ జహంగీర్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు చేస్తున్న నగర పోలీసులు వివిధ కోణాలను పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నారు. బీదర్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందం సైతం దర్యాప్తులో పాలు పంచుకుంటోంది.

ఆటో దిగి బ్యాగులు, వస్త్రాలు కొని...

ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో నగదు నింపే సీఎంఎస్ ఏజెన్సీ వాహనంపై బీదర్‌లో దాడి చేసి, ఒకరిని కాల్చి పంపిన దుండగులు నగదుతో హైదరాబాద్ చేరుకున్న విషయం విదితమే. అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ నుంచి రాయ్‌పూర్‌కు టిక్కెట్లు బుక్ చేసుకోవడం, మినీ బస్సులో బ్యాగుల తనిఖీ, జహంగీర్‌పై కాల్పులు తర్వాత దుండుగల గమ్యం మారింది. అఫ్జల్‌గంజ్ నుంచి ఆటో ఎక్కిన ఇద్దరూ రైలు మిస్ అవుతుందని, తొందరగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు తీసుకువెళ్లాలని డ్రైవర్‌ను కంగారు పెట్టారు. సికింద్రాబాద్‌లోని అల్ఫా హోటల్ వరకు వెళ్లిన ఈ ద్వయం అక్కడ కొత్త బ్యాగ్‌లు, వస్త్రాలు ఖరీదు చేసుకుంది. రైల్వే స్టేషన్ సమీపంలో లాడ్జిల్లో గదులు ఇప్పించే దళారులు తిరుగుతూ ఉంటారు. అలాంటి ఓ వ్యక్తి వీరి వద్దకు వచ్చి రూమ్ కావాలా అంటూ ప్రశ్నించాడు.

గజ్వేల్‌లో మకాం వేయాలని ప్లాన్...

తాము ఉండటానికి రూమ్ కావాలని చెప్పిన దుండగులు అయితే ఇక్కడ వద్దని, గజ్వేల్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగంలో చేరాల్సి ఉందని చెప్పారు. అక్కడ అద్దె ఇల్లు దొరికే వరకు హోటల్‌లో రూమ్ కావాలని చెప్పారు. దీంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద దళారి తనకు పరిచయస్తుడైన గజ్వేల్‌లోని దళారితో మాట్లాడాడు. అతడు రోజుకు రూ.1500 అద్దెకు రూమ్ సిద్ధంగా ఉందని చెప్పడంతో ఇరువురినీ గజ్వేల్ వెళ్లమని ఇక్కడి దళారి సూచించాడు. అలా వెళ్లడానికి ఆటో మాట్లాడి పెట్టమని దుండగులు కోరడంతో సికింద్రాబాద్ దళారి రూ.1500 కిరాయికి ఆటో సైతం మాట్లాడి పెట్టాడు. గజ్వేల్ దళారి నెంబర్ ఆటోడ్రైవర్‌కు ఇచ్చి, ఇద్దరినీ అతడి వద్ద దింపి రమ్మని చెప్పాడు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరుతూనే ఆటోడ్రైవర్ ఓసారి దళారితో మాట్లాడాడు.

పదేపదే దళారీతో మాట్లాడుతుండటంతో...

వీరి ఆటో బయలుదేరిన తర్వాత గజ్వేల్ దళారి రెండుసార్లు డ్రైవర్‌కు ఫోన్ చేసి మాట్లాడాడు. ఆటో తిరుమలగిరి వరకు వెళ్లిన తర్వాత మరోసారి కాల్ చేయడంతో దుండగులకు అనుమానం వచ్చింది. అక్కడ ఓ నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపమని చెప్పిన ఇరువురూ బ్యాగ్‌లతో సహా ఆటో దిగి రూ.500 చెల్లించి వెళ్లిపోయారు. అక్కడి నిర్మానుష్య ప్రాంతంలో నగదును ట్రాలీ బ్యాగ్‌ల నుంచి మరో బ్యాగుల్లోకి మార్చుకున్నారు. ఆపై కొద్దిదూరం వెళ్లిన తర్వాత వస్త్రాలు సైతం మార్చేశారు. అక్కడ నుంచి మళ్లీ తిరుమలగిరి ప్రధాన రహదారి మీదికి వచ్చి బోయిన్‌పల్లి వైపు వెళ్లినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన దృశ్యాల ఆధారంగా ఈ విషయాలు గుర్తించిన పోలీసులు ఇప్పటికే ఆటోడ్రైవర్లు, దళారుల నుంచి వాంగ్మూలాలను నమోదు చేశారు.

బీ–క్లాస్ పట్టణాలనే ఎంచుకుని...

ఈ నేరాలు జరిగిన తీరు ఆ తర్వాత చోటు చేసుకున్న పరిణామాలను పరిగణలోకి తీసుకున్న పోలీసులు దుండగులు బీ–క్లాస్ సిటీలు, పట్టణాలనే ఎంపిక చేసుకుంటున్నట్లు భావిస్తున్నారు. పోలీసుల అప్రమత్తత, హడావుడి తక్కువగా ఉంటుందనే ఉద్దేశంతోనే దుండగులు ఇలా చేస్తున్నారని అంచనా వేస్తున్నారు. కర్ణాటకలోని ఈ తరహాకు చెందిన పట్టణం బీదర్‌ను టార్గెట్‌గా చేసుకున్నారు. అఫ్జల్‌గంజ్‌లో ఫైరింగ్ తర్వాత తమ స్వస్థలాలకు వెళ్లకుండా ఇలాంటి పట్టణమే అయిన గజ్వేల్ వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ కీలకాంశాన్ని సైతం పరిగణలోకి తీసుకున్న దర్యాప్తు అధికారులు గాలింపు కొనసాగిస్తున్నారు. మరోపక్క బీదర్‌లో నేరం చేయడానికి, అక్కడ నుంచి సిటీ రావడానికి నిందితులు వినియోగించిన వాహనాన్ని సైతం హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిసింది.